కథ

# దైవం మానుష్య రూపేణా

సూరిశెట్టి వసంతకుమార్

62812 87659

సూర్యకిరణాలు నెమ్మది నెమ్మదిగా లోకాన్ని కాంతిమంతం చేస్తున్న సమయమది. అప్పటికే రకరకాల వంటకాలతో డైనింగ్ టేబుల్ నిండిపోయింది. అమెరికాలోని న్యూజెర్సీ నుంచి రాబోతున్న తన కొడుకు మాధవన్‌కీ, కోడలు మార్గరెట్‌కీ ఇష్టమైన స్వీట్స్ తయారు చెయ్యడంలో బిజీగా ఉంది కామేశ్వరి.

''ఏమండీ.. టైం అప్పుడే ఆరయిపోయింది. ఫ్లయిట్ పది గంటలకి. ఇప్పుడు బయల్దేరితేనే సరిగ్గా ఉంటుంది''

భర్త రామారావుకి వినిపించేటట్లుగా చెప్పింది.. వంట గదిలోంచి కామేశ్వరి.

''కొడుకూ, కోడలూ రాబోతున్నారన్న సంతోషం.. వాళ్లొచ్చే వరకూ కొంచెం దాచుకో! ఇదిగో నాన్నగారికి టవల్ బాత్ చేయించి బయల్దేరుతాను'' నవ్వుతూ చెప్పాడు రామారావు.

పక్షవాతం వచ్చి ఒక కాలూ, ఒక చెయ్యి పడిపోవడంతో మంచానికే అంకితమై పోయాడు రామనాథం.

''నాన్నగారూ లేవండి. స్నానం చేయించేస్తాను'' అంటూ ఆయన వేసుకున్న బట్టల్ని నెమ్మదిగా తీసి, టవల్‌తో ఒళ్లంతా తుడుస్తూ ఉంటే చూశాడు.. తండ్రి కళ్లల్లోంచి కారుతున్న కన్నీటిని.

''ఎందుకు నాన్నా ఏడుస్తున్నారు. ఇవాళ మీ మనవడూ, మనవడి భార్యా ఇక్కడికి వస్తున్నారు. అందువల్ల మనసులో ఏదీ ఆలోచించకుండా సంతోషంగా ఉండాలి మరి'' అంటూ స్నానం చేయించి బట్టలు మార్చాడు రామారావు.

కామేశ్వరి తెచ్చి ఇచ్చిన టిఫిన్‌ని తండ్రికి తినిపించి ఎయిర్‌పోర్టుకి బయల్దేరాడు రామారావు.

ఇంటికి వచ్చిన కొడుకూ, కోడల్ని చూసి తెగ సంబర పడిపోయింది కామేశ్వరి.

మార్గరెట్‌కి ఆ ఇల్లు, వాతావరణం చాలా కొత్తగా ఉంది. ఇక్కడ ఒకరి కోసం ఒకరు జీవించడం, ప్రేమానురాగాలు పంచుకోవడం చూసి ఆశ్చర్యపోయింది. తల్లీ-తండ్రి, భార్యా-భర్త, కొడుకూ-కోడలు, కూతురూ-అల్లుడు.. ఇలా అందరి బాంధవ్యాలూ ప్రేమపాశంలో చిక్కుకుని ఉండటం, ఒకరి గురించి మరొకరు కష్టాన్నీ సంతోషంగా అనుభవించడం చూస్తుంటే.. ఆనందంతో పులకరించిపోయింది మార్గరెట్.

అమెరికాకి చెందిన మార్గరెట్.. మాధవన్‌ని చూడగానే ప్రేమించేసింది. భారతదేశ సంస్కృతి గురించి, మమతానురాగాల గురించి విన్న ఆమె.. తనకి తెలియకుండానే భారతదేశం మీద పిచ్చి అభిమానాన్ని పెంచుకుంది. అందుకే మాధవన్‌ని చూడగానే ప్రేమించేసింది. అందం, సంస్కారం ఉన్న మార్గరెట్ అంటే మాధవన్‌కీ చాలా ఇష్టం ఏర్పడింది. అదీ కాకుండా తన తల్లిదండ్రులు ఒప్పుకొంటేనే పెళ్లి.. లేకపోతే లేదు అని కచ్చితంగా, నిర్మొహమాటంగా చెప్పిన మాధవన్‌ని ఇంకా ఇష్టపడిపోయింది మార్గరెట్.

అలాగే ఇండియా నుంచి తల్లిదండ్రుల అనుమతి దొరికిన తర్వాతనే మార్గరెట్‌ని పెళ్లి చేసుకున్నాడు మాధవన్. దాదాపు రెండు సంవత్సరాల తర్వాత ఇద్దరూ ఇండియా వచ్చారు.

బాల్కనీలో నిలబడి చుట్టు పక్కలకు చూస్తున్న మార్గరెట్ దగ్గరకి వచ్చాడు మాధవన్. బంగారు ఛాయలో తళతళ లాడుతున్న ఆమె తల వెంట్రుకలు గాలికి ఎగురుతూ ఉంటే.. అందంగా, కుందనపు బొమ్మలా ఉన్న మార్గరెట్.. మాధవన్‌ని చూసి.

''అమ్మ, నాన్నగారు, ఈ ఇల్లు, ప్రశాంతమైన ఈ వాతావరణం, కళ్లతోనే ప్రేమను పంచే తాతయ్య గారు, నాకిక్కడ చాలా బాగుంది మాధవ్'' అంది తెగ సంబరపడుతూ.

ఆమె మాటల్లో నిజాయతీ కనిపించింది.

''నీకీ విషయం తెలుసా? అమ్మ మొదట్లో మన పెళ్లికి ఒప్పుకోలేదు. నాన్నగారే అమ్మ దగ్గర మాట్లాడి, నచ్చచెప్పి ఆమె మనసు మార్చారు. నేను వచ్చేటప్పుడు తాతయ్య బాగానే ఉన్నారు. ఇప్పుడు ఇలా చూస్తుంటే చాలా బాధగా ఉంది. మా ఇంటికి సంబంధించినంత వరకూ నాన్నగారే అన్నీ. మా తాతగారి మనసు కష్టపడకుండా, అమ్మమనసు నొప్పించకుండా చాలా శాంతంగా ఉంటారు. చాలా పెద్ద మనసుతో నిన్ను కోడలుగా చేసుకున్నారు. నాన్నగారంటే అందుకే నాకంత ఇష్టం!'' అంటూ తన తండ్రి గురించి గొప్పగా చెప్పసాగాడు మాధవన్.

''మధూ! నా డెలివరీ టైంలో అమ్మానాన్నలు ఉంటే బాగుంటుందని, వాళ్లని మనతోపాటు తీసుకుని వెళ్దా

